ఒకటిపై రంగం

[ రాధ ఇల్లు. రాధ సీటుగా సూస్తాబయ: డ్రాయింగు రూములో అటూ ఇటూ పచార్లు చేస్తూ ఉంటుంది. మాటిమాటికీ చేతిగడియారం వంక చూసు కుంటూ ఓ మారు గేటుకేసి చూస్తూ విసుక్కుంటూ ఉంటుంది. ఆ విసుగుదలతోనే దక్కున ఫోను దగ్గర ఆగి ఫోనుమీద చెయ్యి వెయ్యబోయి, గుమ్మంలో సన్నగా నవ్వులు వినపడటంతో ఆ ప్రయత్నం విరమించుకుని విసుగు, చిరాకు ఎక్కడి వక్కడ ఎగిరి పోగా ఆనందంగా వాకిలి కేసి తిరుగుతుంది. మాలతి, సుందరి, కమల కిలకిల్లాడుతూ లోపల ప్రవేశిస్తారు. ]

రాధ: రండి, రండి. . . రండి. అమ్మయ్య! ఇప్పటికి ఊడిపడ్డారన్నమాట, అర్జెంటుగా రమ్మని గంటకిందటునగా ఫోన్ చేస్తే!

మాలతి: సరిపోయిందిలే! మీ వారంటే కాంపు వెళ్ళారు కనక నీ కంతా తీరికేగాని, అయ్యగార్లు ...లు పూర్తయి వాళ్ళ పనుల్లోకి పోతేగాని మనకి చావడానికయినా తీరికుంటుందా చెప్పు?

మాలతి: గెస్టు లొచ్చారుట, వస్తే వదమందిలే. అస లింతకీ ఏమిటోయ్ నీ హడావుడి! అంత హటా హటిన మమ్మల్నందరినీ ఎందుకు పిలిచావ్?

రాధ: మీ రసలు చెప్పనిస్తున్నారా నన్ను?

కమల: ఒకటికూడా కాదు, రెండుట! రెండు కప్పుల కాఫీ ఫ్లాస్కులో పోసి, పకోడీలు వేయించి టేబిలుమీద పెడితేకాని గుమ్మం దాటడానికి లేకపోయింది కదా పాడు బతుక్కి!

మాలతి: అబ్బ! ఆపవోయ్ కాసేపు. మన సొద లెప్పుడూ ఉండేవేగా!

కమల: అం. . .తే. . .లే! ( నీరసంగా చూస్తూ టేబిలుమీదున్న పేప రందుకుంటుంది. )

రాధ: ఇక చెప్పమ్మనా? ( కొంచెం విసుగ్గా అడుగు తుంది. )

సుందరి: ఎస్. గో ఆన్.

రాధ: మరేం లేదర్రా. ఈ వేళ ఉన్నట్టుండి నా బుర్ర లోకి ఓ వండర్‌ఫుల్ ఐడియా వచ్చింది. మన మంతా మధ్యాహ్నం ఎలాగూ ఫ్రీగానే ఉంటాం కదా అని ఓ చిన్న ప్రోగ్రామ్ వేశాను.

కమల: ఆఁ ఆఁ వింటున్నాలే. రచయిత్రి చిత్రాదేవికదూ?

రాధ: అమ్మయ్య! తెలివిగానే ఉన్నావన్నమాట!

మాలతి: అస లావిడ ఊసెందు కొచ్చిందట?

రాధ: అది కాదోయ్. కొన్ని రోజుల క్రిందట ఆవిడ భర్తగారికి ట్రాన్స్‌ఫర్ అయిన సందర్భంలో ఈ ఊరొచ్చారని తెలుసుగా మీకు?

మాలతి: అవును. ముందు మన సుందరి చెపితేనే కదా విన్నాం?

రాధ: వింటే ఏమయింది? ఎప్పుడైనా ఆవిడను చూశారా మీరు?

మాలతి: నువ్వు చూసిందేమిటి కొంప తీసి — మాకు తెలియకుండా?

రాధ: అయ్యో ఖర్మ! చెప్పేది పూర్తిగా వినిపించుకో కుండా ఏమి టా గోల? అస లిప్పుడు మిమ్మల్ని రప్పించిం దెందు కనుకున్నారు? మనమంతా కలిసి ఈ వేళ చిత్రాదేవి ఇంటి కెళదామనేగా! ఎలా ఉంది ప్రోగ్రామ్?

సుందరి: బాగానే ఉంది. కాని— ( కొంచెం ఆగి )

# ఇంటియమ్మ

ఎ. శ్యామలారాణి

కమల: బాగా చెప్పావులే. అవసరమండీ, అర్జెంటుగా ఎటో వెళ్ళాలన్ననాడు ఇంకా వారి సేవల సంఖ్య పెంచేస్తుంటారులే మా వారు.

సుందరి: మావారైతే మరీ విడ్డూరం. నే నెక్కడికైనా వెళ్ళితీరాలని తన్నుకు చస్తున్న నాడు సరిగా అదే సమయంలో న న్నెక్కడికో తీసుకెళ్ళ దలుచుకున్నట్టు నానా హడావిడీ చేసి, 'చ్ఛ! ఏం చేస్తాం? నిన్ను డిసప్పాయింట్ చెయ్యటం నా కిష్టం లేదు కానీ, ఒక్క మాట మాత్రం జ్ఞాపకం ఉంచుకో. మళ్ళీ నాకు తీరిక చిక్కి నాకు నేనుగా తీసుకెళతానంటే తప్ప ఇంకెక్క డికీ వెళదాం అని మటుకు ప్రాణం తియ్యకేం?' అని సమయం చూసి నాకు పాఠం చేస్తుంటారు. ఏం చెప్పను గోడు!

రాధ: ముందు కూర్చోండర్రా, బాబూ, శ్రీవార్ల పురాణం తరవాత తీరిగ్గా చెప్పుకోవచ్చు.

( సుందరిని భుజాలు పట్టి బలవంతాన ఓ కుర్చీలో కూర్చోపెడుతుంది. మాలతి, కమల కూడా మరి రెండు కుర్చీల్లో కూర్చుంటారు. )

ఇంతకీ మన విమ ల్కెక్కడ?

మాలతి: ఏమిటో! ( ఆత్రతగా అడుగుతుంది. )

రాధ: అలా అడుగు మరి! చిత్రాదేవి అంటే తెలుసుగా మీకు?

సుందరి: అయ్యో, ఎందుకు తెలియదూ? మన పత్రికలు సగానికి సగం ఆవిడ మీద బతుకుతున్నవేగా!

( ఉత్సాహంగా కాస్త ముందుకొస్తుంది. )

రాధ: ( పేపరు చూస్తున్న కమల నుద్దేశించి కాస్త గట్టిగా ) ఏమోయ్! వింటున్నావా?

పాత్రలు:

| | |
|---|---|
| రాధ | |
| మాలతి | రాధ స్నేహితురాళ్ళు |
| సుందరి | రాధ స్నేహితురాళ్ళు |
| కమల | రాధ స్నేహితురాళ్ళు |
| విమల | రాధ స్నేహితురాళ్ళు |
| చంద్రమ్మ (రచయిత్రి చిత్రాదేవి) | |
| సరళ (చిత్రాదేవి స్నేహితురాలు) | |

ఆవిడ బలే గర్విష్ఠి అని విన్నాను. మన నెలా ట్రీట్ చేస్తుందో?

రాధ: ఆఁ. ఆ గర్వం గిర్వం మన దగ్గర పనికి రాదోయ్! అలాంటి దేమైనా ఉంటే అది కాస్తా వదిలగొట్టి మరీ వస్తాం.

మాలతి: అయితే ఫోన్ చెయ్య— మనం వస్తున్నట్టు.

రాధ: అఘోరించినట్టుంది తెలివి! అలాంటి వాళ్ళ దగ్గరి కెళుతున్నప్పుడు చెప్పా చెయ్యకుండా వెళ్ళడంలోనే ఉందోయ్ మజా అంతా. అనుకోకుండా ఎవరైనా వచ్చినప్పుడు ఆవిడ ఏం చేస్తుంటుంది? ఎలా డ్రెస్ చేసుకుంటుంది? ఎలా మాట్లాడుతుంది? ఇవన్నీ కనిపెట్టాలనేగా!

( ఏదో గుట్టు చెపుతున్నట్టుంటుంది. )


కమల: ఇంతగా డెవలప్ అయిన కంట్రీస్‌లోకూడా ఆడవాళ్ళు సమానత్వం కోసం ఇంకా అరిచి చస్తూనే ఉన్నారంటే మన బతుకులికే. . .

మాలతి: మూడు, మహాతల్లీ! ఆ పేపరు మీ ఇంటి కెళ్ళాక చదువుకోకూడదూ?

కమల: అబ్బే. . . ఏదీ. . . నే నేం చదవలేదుగా? ఇలా ఓ సారి చూశానంతే.



రాధ: అయితే నువ్వు చూస్తూ కూర్చో. మేమలా వెళ్ళొస్తాం.
కమల: ఎక్కడికి?
రాధ: ఏడ్చావ్లే ( నెత్తి కొట్టుకుంటుంది. )
కమల: ఏమంటే నా కెంతో సరదా. చిన్నప్పుడు మా తాతగారి ఊళ్ళో . . .
సుందరి: చూడు, కమలా! ఆ దిక్కుమాలిన పేపరు చదువుతూ నువ్వు వినిపించుకోలేదేమో కాని మేం లలయ్యతి చిత్రాగారి ఇంటి కెళ్ళబోతున్నాం. వస్తావా? రావా? ఒక్క మాటలో చెప్పు.
కమల: అలా చెప్పు మరి! నే నెందుకు రానూ— కథ అంటే పడి చచ్చేదాన్ని కదా?
రాధ: ( మళ్ళీ మూడ్‌లో కొస్తుంది. ) మనం వెళ్ళి ఆవిడని ఇంటర్వ్యూ చెయ్యాలి. కింద మీద పెట్టి ఆవిడ గుట్టునీ లాగాలి. ( కమల మళ్ళీ పేపరులో తలదూర్చేస్తుంది. ) మనలో ఒక్కొళ్ళం ఒక్కో ప్రశ్న వేసి ఆవిడ బుర్ర తిరిగిపోయేలా— ( కమల కేసి కోపంగా చూసి టక్కున ఆగి పోతుంది. నిశ్శబ్దం ఆవరించడంతో కమల తుళ్ళిపడి చూస్తున్న పేపరు మడిచేస్తుంది. )
కమల: సారీ! ఏమంటున్నావూ?
రాధ: నా తలకాయ!
కమల: అబ్బ. . . నే వింటున్నా లేవోయ్!
మాలతి: ఏమిటోయ్ నువ్వు విన్నది? ( దూకుడుగా అడుగుతుంది. )
కమల: అదే. . . బుర్ర తిరుగుడు ప్రశ్న వేసి. . . త. . . త. . . త—కాదు. . . కాదు. . . బుర్ర తిరిగి పోయేలాంటి ప్రశ్న వేసి— ( సుందరి పేపర్ని లాక్కుని ఇంకా దగ్గరగా మడిచి దూరంగా ఓ మూలకి విసిరేస్తుంది. )
రాధ: పోనీలే. బుర్ర తిరుగుడో, పొయ్యే కాలమో ఏదో ఒకటి. అసలు విషయానికి రండి. మనం ఏం ప్రశ్న లెయ్యాలి? అదికదా ముందు మనం డిసైడ్ చేసుకోవాలి?
మాలతి: అవునవును.
సుందరి: నిజమే, ముందే డిసైడ్ చేసుకోవాలి.
రాధ: కాని, ఒక్క సంగతి. చాలా విషయాలు మనం ప్రశ్న రూపకంగా కాకుండా గడుసుగా మాటలు మెలి పెట్టి నిజాన్ని కక్కించాలి. ఏమంటారు?
సుందరి: అవును.
రాధ: అయితే, మనం తెలుసుకోవలసిన [illegible]
మాలతి: నువ్వే చెప్పు.



ఏమిటా నవ్వేది

ఫోటో— డి. సురేంద్రారెడ్డి (మెదక్)

రాధ: ( గర్వంగా ) చెవుతున్నా వినండయితే. ఒకటి, రచయిత్రి నిజమైన వయస్సెంత?

కమల: నిజమైన వయస్సు, అబద్ధం వయస్సు ఏమిటి?

రాధ: పేరుపడ్డవాళ్ళు ఎప్పుడూ ఉన్న వయస్సు చెప్పుకోరు కనక!

సుందరి: యు ఆర్ కరెక్ట్!

రాధ: రెండు— ఈ కథలన్నీ ఆవిడే రాస్తుందా? లేక, ఆవిడ హస్బెండ్‌గాని రాసి ఈవిడ పేరున ప్రచురిస్తాడా?

కమల: అంత మంచి మొగుళ్ళుంటా రంటావా? మా చెల్లెలి ఆడపడుచు కథలు రాద్దామని ఉబలాట పడితే తన పేరున పంపితేనే రాయమని ఆ అమ్మాయి మొగుడు షరతు పెట్టాట్టలే!

సుందరి: ( ఉత్సాహంగా కమలతో ) అప్పుడేం చేసిందయితే?

రాధ: ఏం చేసిందా— మీ లాంటి వాళ్ళు నలుగుర్ని పోగేసి ఈ సంగతి చాటుకుందిట. సరా? ( కోపంతో విసురుగా అంటుంది. )

సుందరి: ఓహో— సారీ! ఆ— ఎంతవర కొచ్చామయితే? రెండు చెప్పావు. మూడు?

రాధ: ( మళ్ళీ కాస్త సర్దుకుని ) మూడు— ఒకవేళ ఆవిడ స్వంత రచనలే అయితే కథావస్తువు లెలా సంగ్రహిస్తుంది? హాట్‌డ్రింక్స్ లాంటి వేమైనా పుచ్చుకునే అలవాటుందా, లేక. . .

కమల: అమ్మ బాబోయ్— హాట్ డ్రింక్సే! ఆడవాళ్ళు కూడా పుచ్చుకుంటారంటావా? నే న్నమ్మను సుమా!

రాధ: ఏం? అందరూ నీ లాంటి, నా లాంటి టీటోటలర్స్ అనుకున్నా వేమిటి? ఏమోసుమా— నా కను మానమే— అందులోనూ కథలూ, కవిత్వాలూ రాసేవాళ్ళకి అడపా దడపానయినా పుచ్చుకునే అలవాటుంటుందనే నా నమ్మకం.

మాలతి: కొంపతీసి మనం వెళ్ళిన టైముకి ఆవిడ తాగి తందన్నపదాలు పాడుతూండాలిట. ఇక నడిగావా! ( సంబరంగా ఓ చిటిక వేసి అలా జరిగితే బాగుండునన్నట్లు చూస్తుంది. )

రాధ: అలా అయితే ఇక చెప్పాలా? మనం అనుకున్న పని మరింత సులువై పోతుందోయ్, మాలతీ! విస్కీ మీదున్న వాళ్ళు నిజాలే చెపుతారంటారులే! ఓ ఆట ఆడించి రావచ్చు. ఆ ఇంటర్వ్యూని కాని రాసి పత్రికల కెక్కించామో— ఈవిడగారి బండారం బయట పడుతుంది. ఫలానా వాళ్ళ ధర్మమా అని రచయిత్రి నిజజీవితం తెలుసుకున్నామని థాంక్స్ చెప్పుకుంటా రంతా.

సుందరి: ( చప్పట్లు చరిచి ) ఏమైనా నీ బ్రెయిను సుందే— భలే పదునోయ్!

మాలతి: కాని చిన్న షరతు. అలా ఇంటర్వ్యూని ప్రచురించటమే జరిగినప్పుడు మా అందరి పేర్లూ కూడా అందులో ఉండాలి సుమా మరి!

రాధ: అంటే? నా ఒక్కర్తె పేరే రాసేసుకుంటాననా మీ అనుమానం! పోనీలెండ్రా— అంత సెల్ఫిష్‌గా కనుపిస్తున్నా నన్నమాట నేను మీకు? ( అలక, కోపం మిళాయించి ముఖం ముడుచుకుంటుంది. )

కమల: ఛ! అలా ఎవరన్నారోయ్, రాధా? మా పేర్లు కూడా కాస్త అచ్చులో చూడవచ్చునన్న సరదా కొద్దీ పాపం, మాలతేదో అంది కాని, నిజంగా మ స్వంత సెల్ఫిష్ అయితే మా ఎవ్వరికీ చెప్ప కుండా నువ్వొక్కర్తెవే వెళ్ళి ఇంటర్వ్యూ చేసేసే దానివిగా! ( మిగిలిన ఇద్దరి కేసీ సాభిప్రాయంగా చూస్తుంది. )

మాలతి: కరెక్ట్. . . డావ్ కరెక్ట్. . . అంతేనోయ్ నా ఉద్దేశ్యం. నే నేమనేయలేదులే నిన్ను. ( సరదాగా రాధని గిలిగింతలు పెట్టి ముఖం విప్పారేలా చేస్తుంది. )

సుందరి: ఆ... ఆ. . . ఆ. . . అదుగో, అదుగో ఆ... వచ్చేసింది.

( అందరితోపాటు రాధకూడాహాయిగానవ్వేస్తుంది. )

మాలతి: ఇంకా మన విమలమ్మ దిగబడలేదేమిటే?!

సుందరి: త నెప్పుడు వేళకొచ్చిందిలే!

కమల: ( వాకిలి కేసి చూస్తూ ) అదుగో. . . వస్తూన్నట్టుంది.

( విమల హడావుడిగా ప్రవేశిస్తుంది. )

విమల: సారీ! కొంచెం లేటుగా వచ్చినట్టున్నాను.

రాధ: కొంచెం ఏమిటిలే? మనం ఎప్పుడూ జీవితకాలం లేటుగా!

విమల: ఇంతకీ సంగతేమిటి?

మాలతి: సరిపోయింది— రెడ్డొచ్చె మొదలాడన్నట్టు!

సుందరి: మాతో కలిసి పదవోయ్ ముందు. సంగతేమిటో దార్లో చెప్తాంలే!

రాధ: మరైతే మనం తొందరగా బయలుదేరుదాం.

మాలతి: ఓ కే.

సుందరి: ఉయ్ ఆర్ రెడీ!

( వానిటీ బాగ్‌లు చేతుల్లోకి తీసుకుని అంతా లేస్తారు. )

## రెండవ రంగం

[ రచయిత్రి చిత్రాదేవి ఇల్లు. డ్రాయింగు రూము. మధ్యలో సోఫాసెట్టు. పక్కనే చిన్న స్టూలుమీద ఫోను. మరో పక్కగా టేబిలు. దానిమీద కొన్ని పుస్తకాలు, కాగితాలు చిందరవందరగా పడి ఉంటాయి. ఆ పక్క నొక కుర్చీ ఉంటుంది. గోడల కక్కడక్కడ పెయింటింగ్స్ వేలాడుతూంటాయి. పనిమనిషి అక్క డున్న వస్తువులన్నీ క్లీన్ చేస్తూ సరిగా సర్దుతూంటుంది. పడి వేయకుండా మెల్లగా రాధ, ఆమె స్నేహితురాళ్ళు వాకిలి దగ్గరికొస్తారు. వాళ్ళకి ఎదురుగా ఉన్న పనిమనిషి అద్దం చేతిలోకి తీసుకుని కొప్పు సవరించుకుంటూ అద్దంలో తనను తానే చూసుకుని మురిసిపోతూంటుంది.

దానితోపాటు చిన్న కూనిరాగంకూడా ప్రారంభిస్తుంది.]

చంద్రమ్మ: నువ్వు తిరిగిరావె గైరమ్మో తిరపతి మేడలకీ నువ్వు మళ్ళిరావె గైరమ్మో మళ్ళి మేడలకీ— (గుమ్మం దగ్గర చిన్న అలికిడయి వెనుతిరిగి వాళ్ళందర్నీ చూసి సడన్‌బ్రేక్ వేసినట్టు పాట ఆపేస్తుంది.)

రాధ: ఏయ్! మీ అమ్మగారున్నారా ఇంట్లో?

చంద్రమ్మ: అమ్మగోరా. . . అమ్మగోరా. . . (దర్జాగా, దర్పంగా ఉన్నవాళ్ళనీ, వాళ్ళ అలంకరణల్నీ మిర్రి మిర్రి చూస్తూంటుంది.)

రాధ: ఆఁ. అమ్మగారే! ఉన్నారా?

చంద్రమ్మ: అమ్మగోరా. . . అమ్మగోరా. . . నేరండి. శేగాచ్చేత్తస ఇప్పుడే ఏయిటాకో ఎళ్ళినారండి. (వినయంగా కాస్త పక్కకి జరిగి నిలబడుతుంది.)

మాలతి: బేగంటే? ఎంత సేపట్లో వస్తారో తెలీయదా?

చంద్రమ్మ: తెల్దండి.

సుందరి: ఓహ్! వాట్ ఎ గ్రేట్ డిసప్పాయింట్‌మెంట్! (విసుక్కుంటుంది.)

రాధ: నో. . . నో. . . నో. . . ఇన్‌ఫాక్ట్ ఇటీజ్ ఎ వండర్ఫుల్ ఆపర్చ్యూనిటీ!

(చంద్రమ్మ గోడవారగా ఉన్న టేబిలు సర్దటానికి కాస్త దూరంగా వెళుతుంది. ఆమెకేసి ఓ చూపు పారేసి స్నేహితురాళ్ళ దగ్గరగా వచ్చి కాస్త గొంతు తగ్గించి) ఇంట్లో ఉండే పనిమనిషికీ, వంటమనిషికీ తెలిసినన్ని రహస్యాలెవరికీ తెలియవు. మనం అవిడొచ్చే లోపల దీన్నే ఇంటర్వ్యూ చేసి వీలయినన్ని సంగతులు రాబట్టొచ్చు. ఎలా ఉంది ఐడియా?

మాలతి: వెరీ గుడ్ ఐడియా!

సుందరి: బ్రహ్మాండంగా ఉంది.

విమల: ఏమైనా రాధ బుర్ర పాదరసం.

రాధ: (చంద్రమ్మకు కాస్త దగ్గరగా వచ్చి) చూడమ్మా!

చంద్రమ్మ: అమ్మగాదండి. నా పేరు చెంద్రమ్మండి. అమ్మగోరు ముద్దుగా 'సెందిరీ' అంటారండి.

రాధ: పోనీలే— చంద్రమ్మో, మారెమ్మో ఏదో ఒకటిగాని, మీ అమ్మగారొచ్చేవరకూ మేం కూర్చోవచ్చా?

చంద్రమ్మ: అయ్యోతల్లి! కూకోండమ్మ. మీకు పని పొట్టిపోతే కూకుందికేం?

రాధ: (కాస్త ఉక్రోషంగా) పని పాటా లేద నెవడు చెప్పాడు నీతో? పోనీ, ఇంత దూరం వచ్చాం కదా అని ఆలోచిస్తున్నాం కాని.

(రాధ స్నేహితురాళ్ళంతా కూడా 'ఏమి టీ అధిక ప్రసంగం?' అన్నట్టు చంద్రమ్మ కేసి చూస్తారు.)

చంద్రమ్మ: అయ్యయ్యో. . . కూకోండి, తల్లీ. . . కూకోండమ్మా. (మరోమారు సోఫాలు తుడిచి వినయంగా కూచోమని చూపిస్తుంది. అంతా కూర్చుంటారు.)

రాధ: చూడమ్మా!

చంద్రమ్మ: నా పేరు సెంద్రమ్మండి.

రాధ: సారీ! చంద్రమ్మా!

చంద్రమ్మ: ఏటి, తల్లీ?

రాధ: నువ్వీ ఇంట్లో ఎన్నాళ్ళనుంచి పని చేస్తున్నావ్?

చంద్రమ్మ: ఆ రొచ్చిన కాణ్ణుంచి నానే సేత్తన్నానండి.

మాలతి: ఆఁ చంద్రమ్మా! అయితే, మీ అమ్మగారు, బాబుగారు మంచివారేనా?

చంద్రమ్మ: కూలిసేసుకు బతికే మాలాటోళ్ళకి అరి మంచి పెద్దలోత్తె వసేటుండి?

(మాలతి ఇంకేదో అనబోతూంటే సంజ్ఞతోనే వారిస్తుంది రాధ.)

రాధ: మా బాగా చెప్పేవమ్మా! సారీ— చంద్రమ్మా, అసలు నిన్ను చూస్తుంటేనే తగు మనిషిలా కనుపిస్తున్నావు.

(సిగ్గుగా నవ్వి తల దించుకుంటుంది చంద్రమ్మ. మరి కాస్త పొగడమన్నట్టు మిగిలిన వారికి సంజ్ఞ చేస్తుంది రాధ.)

విమల: పట్టి తగుమనిషే కాదు. దాని ముఖంలో ఎంత కళుందో చూడండి!

సుందరి: అవలా కట్టు, బొట్టు, కొప్పు, మెడలో పూలదండలు, ఆ కాళ్ళ కడియాలు తీసి పారేసి చక్కా ఓ వాయిల్ చీర కడితే మన మెవ్వరం పనికిరాము చంద్రమ్మ దగ్గర.

చంద్రమ్మ: ఎళ్ళండమ్మగోరూ! (మరి కాస్త ముడుచుకుపోతుంది.)

కమల: నిజం, చంద్రమ్మా! ఆ మాట కొస్తే అసలు నువ్విలాగే ఎంతో నిండుగా, అందంగా సందూరి వారి ఎంకిలా ఉన్నావు!

చంద్రమ్మ: అర్రెరె— మా యమ్మగోరుగూడ సరిగ్గ అలాగే అంటరండి. 'సెందిరీ! నువ్విలా పక్క కొప్పెట్టుగోని, ముద్ద బంతి పువ్వెట్టుగోని, కాసంత కుంకం బొట్టెట్టుగోని, పచ్చని కోగ్గట్టుగోని, ఇక ఇక నవ్వుతంటే అచ్చంగ ఎంకి నాగున్నావే' అంటరండి అమ్మగోరూ! ఎంకి అంటే ఎవురండాయమ్మ?

(దగ్గరగా ఉన్న మాలతి నుద్దేశించి అడుగుతుంది.)

మాలతి: (తడుముకోకుండా) ఎంకి కాదు. ఎంకేశ్వరీ దేవి ఒకప్పుడు మన దేశాన్నేలిన మహారాణిలే!

చంద్రమ్మ: ఓలమ్మ! (ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుక్కుంటుంది. రాధ, స్నేహితురాళ్ళు వచ్చే నవ్వు నాపుకుందుకు ప్రయత్నం చేస్తారు.) అంతే— నాను రాణీనా గుంతనన్నమాట! (లోన అమకోబోయి పైకే అనేసినందుకు ముడుచుకుపోతూ) సె—వల్లకోండమ్మ. నాకు సిగ్గేత్తంది!

రాధ: నీ సిగ్గు బంగారమయిర్నీగాని, చూడమ్మో, సారీ! చంద్రమ్మా! మీ అమ్మగారి ఫోటో ఏదీ లేదూ ఇక్కడ? (గది నాలుగు వైపులా చూస్తుంది.)

చంద్రమ్మ: నేదండి.

సుందరి: పోనీలే కాని ఎలా ఉంటా రావిడ?

చంద్రమ్మ: మీ రెప్పుడూ సూడ్నేదేటండి? టీవబోతూ దుసుండగడేవేంది? గడియో, సిటవో అమ్మగోరె వత్తర్నాండి.

మాలతి: అదిసరిలే. నువ్వు చెప్పు. (బుజ్జగింపుగా అడుగుతుంది.)

చంద్రమ్మ: సూడండమ్మ! మీరూ మీరూ సదువుకున్నమ్మలు— నానో? డొక్క సీరితే అచ్చరం ముక్క నేనిదాన్ని— ఉన్నదున్నట్టు 'సెడీ'మని ఒగేసిన్నంతే నా పమాదిపోద్ది!

రాధ: ఆఁ— సింగినాదం— మేమేం ఇవన్నీ మళ్ళీ మీ అమ్మగారి దగ్గరికి మోస్తామనుకున్నావేమిటి?

చంద్రమ్మ: ఫైన మంతర్నై తే. . . అనకూడదుగానమ్మ (తెంపలేసుకుంటూ)— నా కా దమ్మగోరు దియుటేముందు దీవన్నెమ్మెనాగుంత రంతే నమ్మండి.

సుందరి: అబ్బో! అంత అందగత్తెన్న మా టావిడ! (అందరికేసీ చూసి తమాషాగా కళ్ళు తిప్పుతుంది.)

చంద్రమ్మ: తల్లోల్లీ. . . మీ పుస్సైపుంతది. అమ్మగోరికా దనేరు సుమండి!


విమల: ద ధ . . . మే మంత తెలివితక్కువవాళ్ళ మనుకున్నావా, చంద్రమ్మా!

కమల: అయినా, అవిడగారు సున్దరియనూ ఉండే



బొమ్మ బొమ్మ

ఫోటో— బి. (ఎ) శర్మ (బెంగుళూరు)




మనకెందుకు? మాలాకాళిలా ఉంటే మన కెందుకుగాని, నీ నోట్లో దుమ్ము కొడతామా ఎక్కడైనా? తప్పు. . . తప్పు. (ముక్కు మీద వేలేసుకుంటుంది. రాధ మెల్లగా లేచి ఓ సారి గుమ్మం దగ్గరి కెళ్ళి తొంగి చూసి ఎవరూ వస్తున్న అలికిడి లేకపోవడంతో కాస్త ధైర్యంగా వచ్చి కూర్చుంటుంది.)

రాధ: అయితే, చంద్రమ్మా! నిన్న మాటడుగుతా కాని జవాబు చెప్తావా? కొంప తీసి మళ్ళీ మీ అమ్మగారి దగ్గర చెప్పకుమా! మ వ్వన్న మాటలు మే మెలా చెప్పుతున్నామో, మే మన్నవి నువ్వూ అలాగే చెప్పకూడదు మరి. ఏం?

చంద్రమ్మ: మీ మీద ప్రమాణం చేసి చెబుతును, తల్లీ. చెప్పనంటే చెప్పనంతే! (రాధ తల మీద చెయ్యి పెట్టబోతూంటే జాగ్రత్తగా తప్పుకుంటుంది రాధ.)

రాధ: అయితే మీ అమ్మగారిని నందరూ 'రచయిత్రి' అనడం తెలుసా నీకు?

చంద్రమ్మ: అదేటండి? అమ్మగోరి పేరు సీతమ్మగోరు గదండీ!

మాలతి: ఛ్ఛ! (విసుగ్గా) పేరుకాదు. రచయిత్రి అంటే కథలూ అవీ రాసే ఆవిడ.

చంద్రమ్మ: ఏం కదండీ?

సుందరి: చచ్చాం. దీని బుర్ర కెక్కించబోయేసరికి మన బుర్రలు తిరిగేలా ఉన్నాయి!

కమల: (అందరి కేసీ చూసి) అబ్బ. . . ఉండండర్రా! (చంద్రమ్మ కేసి తిరిగి) అది కాదు, చంద్రమ్మా! మీ అమ్మగారు కాగితాలు, కలం పట్టుకుని ఎప్పుడూ ఏదో రాస్తూంటారు— అవునా?

చంద్రమ్మ: అవునూ. . . అదా రసిత్తిరంటే. . . బలే సిత్తరసిత్తరంగుందమ్మగోరూ! ఏ టేటి. . . రసిత్తిరా...రసిత్తిరి. (నవ్వుతుంది.)

రాధ: అమ్మయ్య. పోనీలే. కాస్త దారిలో పడ్డావ్—ఆఁ. ఆ రాసే ముందర హాట్ డ్రింక్సు లాంటివేమైనా పుచ్చుకుంటారా?

చంద్రమ్మ: అంతేటండమ్మగోరూ? !

రాధ: చచ్చాం. మళ్ళీ క్రాసు. కాస్త సాయం చెయ్యవోయ్, మాలతీ!

మాలతి: అదే, చంద్రమ్మా, అదే. హాట్ డ్రింక్సంటే తెలియదూ? హాట్ డ్రింక్సూ, హాట్ డ్రింక్సూ.. ఛీ. వెధవది సమయాని కా తెలుగు ముక్కొచ్చి చావదు కదా?
(సుందరి, మాలతీరాధా సరిఅయిన మాట తోచక గింజుకుంటూంటారు.)

కమల: ఉండండర్రా నేను బోధపరుస్తాను. (చంద్రమ్మ కేసి తిరిగి) అదికాదు, చంద్రమ్మా! నిషా ఎక్క డానికి పుచ్చుకుంటుంటారు చూశావూ. . .

చంద్రమ్మ: (ఏదో తెలిసిపోయినట్లు పకాలున నవ్వి చప్పట్లు చరిచి) ఓరి ... ఓరి ... ఓరదా! దా న్నంటవేటి! సారాయిగదండమ్మగోరూ?

సుందరి: ఛ. . . సారాకాదు. (చీదరించుకుంటుంది.)

చంద్రమ్మ: అదేటండమ్మ— గొప్పోళ్లనుకునే సీసా మందు, నాకు తెల్దేటి!

రాధ: థాంక్ గాడ్. . . ఆఁ. . . ఆఁ... అవే నీ కెలా తెలుసమ్మా? సారీ— చంద్రమ్మా? (సంబరంగా అడుగుతుంది.)

చంద్రమ్మ: (ఉబ్బిపోతూ) అప్పుడప్పుడమ్మగోరు ఏసుకుంటనే ఉంటరే— నా కెందుకు తెల్దు? (గబగబ అనేసి నాలుక కొరుక్కుని గుమ్మం కేసోసారి భయం భయంగా చూసి) ఓలమ్మో! నా పాడ్నోటితో ఎందుకు చెప్పించావు దేవుడా! (ఏడుపు గొంతుతో గడగడ వణికి పోతూం టుంది. అంతవరకూ గర్వంగా స్నేహితురాళ్ళ కేసి చూస్తున్న రాధ కంగారుగా ముందు కొస్తుంది.)

రాధ: అరెరె. . . నువ్వేం తప్పు మాట్లాడావని, చంద్రమ్మా? ఉన్నదున్నట్లు చెప్పావంతే కదా! (ఓదార్పుగా భుజం తట్టి భయం తీర్చ బోతుంది.)

చంద్రమ్మ: (ఏడుపు గొంతుతోనే) మీకు తెల్దు తల్లోయ్. . . బాబుగోరికీ, అమ్మగోరికీ తెలిసిందంటే నా పేనం పోతది తల్లీ. ఓసారమ్మగోరు తప్ప తాగేసి పడిపోతే నా కళ్ళబడి పోనాదమ్మ. బాబుగోరొచ్చి, 'మీ అమ్మగోరు తాగుతారని ఎవరితో సెప్పాకే, చంద్రమ్మా' అని ఒట్టేయించుకునారయిదు రూపాయిలు పేతి నెల్లెక్కన అయిదు రూపాయిలా నెల్లిపోనాది, మాటా నిలుపుకున్నాను కాదు. ఎవ్వ రూరుకున్నా బగమంతు డూరుకోడు, తల్లోయ్! నా పొట్టకేటి ఖర్మ? నా రాత కేటవుద్దో? నన్ను కప్పించు, బగమంతుడా!

మాలతి: (కంగారుగా రాధ కేసి తిరిగి కాస్త మెల్లగా) చచ్చాం. దీని వెధవ గోలతో ఆవిడొచ్చేస్తుం దేమిటో? తరవాత దీని వంకలోస్తే నా ముందు మన పరువు పోతుంది. దీ న్నోరెలా కట్టించడ మిప్పుడు? (రాధ పర్సులోంచి డబ్బు తీసి ఇమ్మని సుందరికీ, విమలకు సంజ్ఞ చేస్తుంది.)

సుందరి: ఇదీ మేలారుగా— మన దగ్గర చిల్లా. (పేచుపుం చేస్తుంది.)

విమల: నాదీ అదే అమ్మా! (జాలిగా మొహం పెడుతుంది.)

(రాధ అవమానంగా మాలతి, కమలలకు సంజ్ఞ చేస్తుంది. మాలతి, కమల చిల్లర డబ్బులు వానిటీ బాగుల్లోంచి బయటికి తీసి చిరాకుగా తొందర తొందరగా ఇచ్చేస్తారు.)

కమల: పోనీలే. . . తెండు.

రాధ: (హడావుడిగా బాగు తెరిచి మెల్లగా) అమ్మయ్య మరోటి. చూడు.

చంద్రమ్మ: నా పాడ్నోటితో ఎందుకు చెప్పించావు, బగమంతుడా! (గోల పెడుతూంటుంది.)

రాధ: (డబ్బులతో పరుగున చంద్రమ్మ దగ్గరి కొచ్చి) ఛఛఛ...ఊరుకో ఇదికే అంత కొంపలంటుకుపోవాలా? చంద్రమ్మా! అబద్ధాలు చెబితే దేవుడు శిక్షిస్తాడు కాని, ఉన్నదున్నట్లుగా నిజం చెబితే ఎందుకు శిక్షిస్తాడు చెప్పు? మీదు మిక్కిలి నీ నిజాయితీకి సంతోషిస్తాడుకూడా. అలా సంతోషించే ఇలా మా చేత ఇప్పిస్తున్నాడనుకో. ఇదుగో, ఈ డబ్బులు తీసుకుని మంచి బట్టలు కుట్టించుకో నువ్వు. ఇంకేం భయపడకు. అదీకాక మే మేమన్నా మీ అమ్మగారితో చెప్తాం కనుకనా? ఊరికే ఏదో సరదాకి మేం అడిగాం. నువ్వు చెప్పావు. అంతేకదా? ఊఁ ఊఁ. . . దాచుకో డబ్బులు. (డబ్బులు చేతిలో పడ్డాక చంద్రమ్మ బాగా సర్దుకుంటుంది.)

చంద్రమ్మ: మీ సల్లటి నోటితో ఏటి సెప్తె అదే దవిర్వం, తల్లీ, నాకు? (మొగమాటంగానే అందుకుంటూ, జాగ్రత్తగా బొడ్డు మన్న సంచీ తీసి డబ్బు అందులో వేసుకుంటుంది.)

మాలతి: ( కాస్త గొంతు తగ్గించి కమలతో ) అబ్బే— ఇదేం తక్కువ ఘటంలా లేదు!

కమల: ఆయినా ముందు రాదేదో అంటే నేను నమ్మ లేదు సుమా. మొత్తానికి చిత్రాదేవి గట్టి పిండమే నన్నమాట!

మాలతి: ష్. . . మెల్లగా. ( గద్దిస్తుంది. )
( చంద్రమ్మ కాస్త పక్కకు తిరిగి ఎవరూ చూడకుండా బొడ్లోంచి డబ్బుల సంచీ తీసి జాగ్రత్తగా లెక్కెట్టుకుని, తమాషాగా కళ్లెగ రేసి, మళ్లీ కూర్చున్న వాళ్ల కేసి తిరిగి అమాయకంగా చూస్తూంటుంది. రాధ మరో మారు వాకిలి వరకూ వెళ్లి, ఎవరూ రాకపోవడంతో కాస్త దర్జాగా వెనుతిరిగి వస్తుంది. )

రాధ : ఏమిటో, చంద్రమ్మా! కాలం మారిపోతూంది. ఇదివరకటి రోజుల్లో మగాళ్లే తాగి తందనా లాడి పెళ్లాన్ని తన్నుతా రనుకునే వారు. ఇప్పుడు పెళ్లాలే తాగి మొగుళ్లని తన్నే రోజు లొచ్చాయి — కాల మహిమ! హాఁ ... అది సరే గానీ, ఆ రాతలూ కోతలూ మీ అమ్మగా రొక్కర్తే చేస్తుందా, అయ్యగారు కూడా సాయం చేస్తారా? ( పెద్ద ప్రత్యేకత లేన ట్టుగా తేల్చేస్తూ అడుగుతుంది. )

చంద్రమ్మ : అయ్యగో రేదో గునగున చెప్పుకుపోతంటే అమ్మగోరు కలవొట్టుగోని బరబరా బరుకుతూ పోతరండి. ఆ ఇవరాలేటో నాకు తెలవుగాని ...

రాధ : అవున్లే ... నీకేం తెలుస్తుంది పాపం ... ( ఓ ఘడియ ఆగి ) కొంపతీసి ఆవిడ వడిగేవు సుమా! మనం మనం ఏదో ఊసుపోకకి వాగిం దంతా ఆవిడకు తెలిస్తే మర్యాదగా ఉండదు.

చంద్రమ్మ : ( బొడ్డున దోపుకున్న డబ్బుల మీద చెయ్యేసి ఆనందంగా తడుముకుంటూ ) సె — నాకు తెల్దేటి, తల్లీ!

కమల : అయితే ఏమిటి? మొత్తాని కావిడ బ్రహ్మచారిణియే నన్న మాట! మొగుడు చెపితే రాస్తుందా? ( అప్పటికే చంద్రమ్మకు, తమకు వశ్య సన్నిహితత్వం ఫీలవుతూంటా రంతా. రాధ తన చాకచక్యంతోనే అంతవరకూ ఘన విజయం సాధించినట్టు దర్పంగా చూస్తూం దందరికేసీ. )

విమల : అంటే గుమాస్తా పనన్న మాట!

మాలతి : ప్రజ్ఞా పాడూ లేకపోయినా దురలవాట్ల కేం లోటు లేదన్న మాట!

చంద్రమ్మ : ఆటికీ, పెగ్గెలకీ సంబంద వేటమ్మా? పొట్ట సీరితే అచ్చరం ముక్క నేని మా మావఁ ఎందుకు తాగి సస్తండు — సెప్పండి, తల్లీ! అయ్యా యసనాలమ్మా— యసనాలంతే!

సుందరి : ఉన్నమాట చెప్పిందర్రా చంద్రమ్మ!

చంద్రమ్మ : తల్లో ల్లీ మీ పున్నెముంటది — కుసింత మెల్లిగ సెప్పుకోండమ్మా! అమ్మగా రొచ్చేసిందంటే 'ఏ టోగుతున్నవే, సెందిరి' అని నా కొంప్ముట్టుగోని తంతేత్తరమ్మ. నా నోటికాడ కూడు పోద్ది! ( దండం పెట్టి బతిమాలుతుంది. )

రాధ : ష్ ... కొంచెం మెల్లగా మాట్లాడలేర్రా? ఆవి డొచ్చి విన్నదంటే బాగుంటుందా? ( కసురుతుంది. )

సుందరి : ( విసుగ్గా లేచి ) అవునూ, మనం ఇంకెంత సేప విలా కూర్చుంటాం? ఆవిడగారి దర్శనం ఎప్పటికీ కాకుండా ఉంది కదా!

చంద్రమ్మ : కూకోండి, తల్లీ! నాను సూసొత్తను. అమ్మగో రొచ్చే ఏలయిందినెండి. ( వాకిలి దగ్గరి కెళ్లి నిలుచుంటుంది. సుందరి చికాకుగానే పత్రికలవడుతుంది. )

మాలతి : పదండర్రా. ఇంకా విగ్రహాన్ని చూసేదే ముంది? తెలియవలసిన వేవో తెలిశాయిగా!

కమల : నీ కంతా తొందరేనోయ్, మాలతీ! వచ్చే వరకూ తొందర, వెళ్లే వరకూ తొందర. మనం ఇంతదూరం వచ్చింది దీనితో ఇంటర్వ్యూ కోసమా? ఏమయినా సరే ఆవిడ నో సారి చూస్తే గాని వెళ్లడానికి వీల్లే దంతే!

రాధ : ( మాలతికేసి తిరిగి ) అవునోయ్. ఇంతకీ మన



ఇంటర్వ్యూ ఇంకా ఎక్కడ పూర్తయింది చెప్పు? ఆవిడను ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించి 'అసలా కథలు నేను రాయలేదు మొర్రో. నేను రచయిత్రిని కా' నని ఒప్పుకునే వరకు నాకు వదలాలని లేదు సుమా! (పట్టుదల మాదిరిగా బల్ల మీద కొట్టి కమల పక్కన కూర్చుంటుంది.)

విమల : నీ పట్టుదల చూస్తుంటే 'ఆరంభించరు నీచ మానవులు' పద్యం జ్ఞాపకం వొస్తోందోయ్.

మాలతి : (చిరాగ్గా) ఇప్పుడొద్దులే!

సుందరి : పోనీలే. ఇంతసేపూ అరిచి వచ్చాం. ఇళ్లో మంచినీళ్ళయినా తెమ్మను దాన్ని.

రాధ : చూడవిూ! సారీ — ఇవేమిటో వెధవ దింత మతిమరుపు నాకు. చంద్రమ్మా! శుభ్రంగా గ్లాసులు కడిగి మా అమ్మాయిలకీ ఐదు గ్లాసుల మంచినీళ్ళిస్తావా? (కొంచెం స్వరం పెంచి చంద్రమ్మ కేసి తిరిగి అంటుంది.)

చంద్రమ్మ : అయ్యో, తల్లి, సిగ్గేగా! ఎందుకమ్మా! అమ్మగారొచ్చినంతే డింకు తెత్తన్నాండి. (చిన్నగా నవ్వి అదోలా చూస్తున్న వాళ్లని చూసి మరోమారు పక్కున నవ్వి) ఓలమ్మ ... బయపడిపోనారు గావాల. అదేనండమ్మా ... డింకులంటే మీరు చెప్పిన డింకులుగావు. మీనా టోరికి నిమ్మకాయ డింకులే ఇత్తన్నాండి. (నవ్వుతూ లోపలి కెడుతుంది.)

మాలతి : అబ్బో, ఇదెక్కడ! ఆవలిస్తే పేగులు లెక్కెట్టేలా ఉంది!

కమల : కొంపదీసి మన మడిగిన ప్రశ్న ఆవిడతో చెప్పెయ్యదు కదా ఇది? !

రాధ : ఏడిసిందిలే! చెపితే దాని కొంప మునగదూ! ముందే అది పాడిలి వచ్చిందిగా. అదీ కాక ముద్దమూతి కట్టి, బిళ్ల కుడుముల్లా మూడు రూపాయలు దాని మొహాన కొట్టాంగామూ? దానితోటే దాన్నోరు మూసుకుపోయిందిలే! నేను అప్పుడే కనిపెట్టాను దాని సంగతి. (నవ్వుతుంది విజయగర్వంతో.)

సుందరి : మొత్తానికి మన రాధేమయినా అసాధ్యురాల్రా!

(షేక్‌హాండ్ ఇచ్చి అభినందిస్తుంటుంది రాధని. ఇంతలో ఒక స్త్రీ వాకిలి దాటి లోపలి కొచ్చి పిల్లలందరిని కొత్తగా చూస్తూ నిలబడుతుంది. అందరూ ఆశ్చర్యంగా చూస్తూ, మర్యాదగా లేచి నమస్కారం చేస్తారు వినయంగా.)

స్త్రీ : నమస్కారం! మా చిత్ర ఇంట్లోనే ఉందాండి?
(అందరూ మరింత ఆశ్చర్యంలో పడతారు.)

రాధ : (ముందుకొచ్చి) అంటే మీరు చిత్రాదేవిగారు కాదన్నమాట!
(నిరాశగా మిగిలిన వాళ్ళు కూలబడతారు.)

స్త్రీ : (నవ్వుతూ) పంపారు. నన్ను చూసి మా చిత్రనుకున్నారన్న మాట మీరు! నేను చిత్ర స్నేహితురాలినండీ! నా పేరు సరళ. మా చిత్రతో అర్జెంటు పనుండి వచ్చాను.

రాధ : ఓహో. గ్లాడ్ టు మీట్ యు! అని డింట్లో లేరండి. మే మెంతో సేపట్నుంచి ఆవిడకోసమే వెయిట్ చేస్తున్నాం.

సరళ : (ఆశ్చర్యంగా) అరె! ఈవేళప్పు డెక్కడి కెళ్ళిందంటుంది చెప్మా? ! (రాధకేసి తిరిగి) ఇంట్లో ఎవరున్నా రయితే?

రాధ : వాళ్ళ పనిమనిషుంది లెండి లోపల.

సరళ : అలాగా! థాంక్ యూ. చంద్రమ్మా! (చనువుగా పిలుస్తూ గుమ్మం దాటి లోపలికి వెళ్ళిపోయింది. వెళ్ళి నావిడను చిన్న వెక్కిరింపుతో అనుకరిస్తూ స్నేహితురాళ్ళ మధ్య వచ్చి కూర్చుంటుంది రాధ. లోనుండి గట్టిగా మాటలు వినిపిస్తాయి.)

సరళ : మై గాడ్! అరె, చిత్రా, ఏమిటీ వేషం! రాత్రి క్లబ్బులో ఫాన్సీ డ్రెస్‌కి రిహార్సలా —

చిత్ర(లేక)చంద్రమ్మ: ష్...డోంట్ షౌట్!

(రాధ, మాలతి, సుందరి, కమల, విమల ఒక్క సారి షాక్ తిన్నట్టుగా లేచి నిలుచుని కంగారుగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటారు.)

రాధ : ఏమిటీ! ఈ చంద్రమ్మే చిత్రాదేవా?

సుందరి : కొంప మునిగిపోయింది!

కమల : ఎంత టోకరా తిన్నాం!

మాలతి : ఓ గాడ్! వాట్ టు డు!

విమల : నాకు కాళ్ళొణుకుతున్నాయోయ్!

రాధ : (తల పట్టుకుని) నా కేమిటో తల తిరుగుతున్నట్టుందర్రా!

సుందరి : అసలు నీ బుర్రకే పుట్టిన బుద్ధిగా ఇది!

మాలతి : జన్మలో మరవని శాస్తయిందిలే!

కమల : మన ముఖా లెలా చూపించడం మళ్ళీ ఆవిడకు సిగ్గు లేక.

సుందరి : నా మాట విని ఇందాకే పోయి ఉన్నా పని పోయేది. కొంత అవమానంతో వదిలిపోను. ఇప్పుడు తెలిసి తెలిసి ఆవిడతో ఎలా మాట్లాడ్డం?

మాలతి : అయ్యయ్యో! ఎంత తెలివి తక్కువగా వాగాం!

కమల : (విసురుగా రాధకేసి తిరిగి) దీని కంతటికీ నువ్వు కాదూ కారణం? ఛీ. ఛీ. . . భగుడు నమ్మా అని బయలుదేరతీసి మా అందరి పరువూ గంగలో కలిపావ్ ... ఎంత ఇష్టల్ని— ఎంత ఇష్టల్ని నీ మంచి!

రాధ : (ఏడుపు, కంగారు మిళాయించిన గొంతుతో) ఇ న్నింకా చంపక ఉపాయం చూడండర్రా!

మాలతి : ముం దిక్కడి నుంచి పోవడమే ఉపాయం. నేను మాత్రం నా ముఖం చూపించలేను మరి. (బాగ్ తీసుకుంటుంది.)

సుందరి : అంతే! అదే మంచిది. నేను నా ముఖం అంత కంటే చూపించలేను.

కమల : ఇంకొక్క క్షణం ఉండకూడ దిక్కడ, పదండి!

విమల : పదండి ... పదండి ... వేగం ...

(కంగారుగా ఒకరి నొకరు తోసేసుకుంటూ, వానిటీ బాగ్‌లు చేతిలో నిలవక కింద పడేసుకుంటూ పరుగున డ్రాయింగు రూము దాటి బయటకు వెళ్ళిపోతూంటారు. తెర పడుతుంది.)

★

దేవి పిల్స్
REGD.
నొప్పులు లేకుండా ముఖ్యంగా ఉపయోగపడే
క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన
లేక అధికంగా అయ్యేదానికి
సుప్రసిద్ధమైన ఔషధము
SEALED PACKING 10 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
MFRS: SHRINU & CO., MADRAS-1

రు. 15/- లలోనే రేడియో

మా క్రొత్త స్కీము క్రింద పేరు ఫ్యాక్టరీ పెట్టెలో వచ్చే పి డి యం వేవ్ పాకెట్ ట్రాన్సిస్టర్ పొందగలరు. పార్ట్సులు జపాను తయారుచేయబడినవి. ౧ సం. వారంటీ గ్యారంటీ ఇవ్వబడును. అత్యంత సరిచేయబడింది. పోస్టేజి రు. 3/-. వి. పి. పార్సెలు కొరకు వ్రాయుండి. ఆమోదించబడకపోతే వెల వాపసు చెయ్యబడగలదు.
BUNTY RADIOS
Durgiana, Amritsar

ఆరోగ్య సౌభాగ్యములకు
మహిళలు ఆధారపడునవి -
ఆరోగ్య అనారోగ్య పరిసితులలో
లోధ్ర
గర్భపోషణకు,
సుఖప్రసవమునకు
గర్భరక్షక
వేవిళ్ళకు, మలబద్ధకమునకు
మాదీఫల రసాయనం
ప్రసవానంతరం బలమునకు
క్షీరవృద్ధికి
సౌభాగ్యశొంఠి
88 సంవత్సరములకు పైగా
ప్రసిద్ధిగాంచిన ఔషధములు
కేసరి కుటీరం ప్రైవేట్ లి.,
మద్రాసు-14
ఏజెంట్లు : సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ.
SWASTIK